ప్రజాశక్తి

గురువారం 22 జూన్ 2023 5 శ్రీ సత్యసాయి

జెఎన్‌టియు ఇంజినీరింగ్ విభాగాలకు

ఎన్‌బిఎ గుర్తింపు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలోని కెమికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలకు మూడు సంవత్సరాల పాటు నేషనల్ బోర్డ్ అఫ్ అక్రిడేషన్(ఎంబిఎ) గుర్తింపు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సుజాత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీ అధికారులు, కళాశాల భోధన, భోధనేతర సిబ్బంది సహాయంతో 2025 సంవత్సరం వరకు సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాలకు ఎన్‌బిఎ గుర్తింపు సాధించగలిగామని తెలిపారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల నేషనల్ బోర్డ్ అఫ్ అక్రిడేషన్ గుర్తింపు పొందిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, భోధన, భోధనేతర సిబ్బందికి ఉపకులపతి జి.రంగజనార్ధన, రెక్టార్ ఆచార్య యం.విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్‌లు అభినందనలు తెలిపారు.

వేగవంతంగా ప్రాధాన్యత భవన నిర్మాణ పనులు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణ పనులను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లతో భవన నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఒ కొండయ్య, పంచాయతీరాజ్ ఎస్‌ఈ గోపాల్ రెడ్డి, ఈఈ మురళిమోహన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఆర్ ఇంజినీర్లు జవాబుదారీతనంతో పని చేయాలని ఆదేశించారు. ప్రాధాన్యత భవనాలైన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ సెంటర్ల పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పర్యవేక్షించాలన్నారు. అసిస్టెంట్లు ఇంజనీర్ రోజు మండలంలో తిరగాలన్నారు. నిర్మాణ పనులతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. మండల డివిజన్ అధికారులు నిర్మాణాలపై సమీక్షించుకోవాలన్నారు. భవన నిర్మాణ పనుల్లో వెనుకబడిన ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 245 రైతు భరోసా కేంద్రాలు, 269 వెల్నెస్ సెంటర్లు, 305 గ్రామ సచివాలయ భవనాలు, పూర్తి కావాల్సి ఉందన్నారు. వచ్చే సెప్టెంబర్ 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని డివిజన్ ఇంజనీర్లు కన్న మధుసూదన్, వెంకటరమణ, పద్మావతి, శ్రీనివాసులు, హరికష్ణ ఏఈలు శశి కుమార్, నాగరాజు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

యోగసనాలు చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం :కలెక్టర్

యోగాసనాల ద్వారా ఒత్తిడి దూరం అయ్యి సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. బుధవారం నాడు పుట్టపర్తి పట్టణంలోని హనుమన్ కూడలి ప్రాంగణంలో 9వ అంతర్జాతీయ యోగా డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఆర్డీవో భాగ్యరేఖ, ఓంశాంతి ప్రతినిధులు లక్ష్మక్క, ఆయుష్ ప్రతినిధి డాక్టర్ కష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయాన్నే యోగా సాధన చేయడం ద్వారా శరీరం ఆరోగ్యంగా, దఢంగా ఉంటుందని తెలిపారు. ప్రతిరోజూ వ్యాయామంతో పాటు నడకను అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చు కుంటే రోగాల బారిన పడకుండా ఉండే అవకాశం ఉందన్నారు. మానసిక ప్రశాంతతో పాటు దీర్ఘకాలిక జబ్బుల నుంచి బయటపడి ప్రతి మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించేందుకు యోగా తోడ్పడు తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలకు విద్యుత్ షాక్

పిసిసి ఉపాధ్యక్షుడు తులసి రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న తులసి రెడ్డి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక విద్యుత్ బిల్లులు చూడగానే ప్రజలకు షాక్ కొట్టే పరిస్థితి ఏర్పడిందని మాజీ రాజ్యసభ సభ్యుడు, ఎపి పిసిసి ఉపాధ్యక్షుడు తులసి రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ముదిగుబ్బలో విలేకరులతో మాట్లాడారు. గతంలో కరెంటు తీగ పట్టుకుంటే షాక్ కొట్టేదని, వైసిపి పాలనలో కరెంట్ బిల్లు చూడగానే షాక్ కొడుతోందని ఎద్దేవా చేశారు. వైసిపి అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచమని, ఉన్నవి కూడా తగ్గిస్తామని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే అందుకు విరుద్ధంగా వివిధ పేర్లతో ఎడాపెడా విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై మోయలేని భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల్లో ఏడు సార్లు కరెంటు ఛార్జీలు పెంచారని తెలిపారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రైతులు, ప్రజలపై భారాలు మోపడం తగదని, తక్షణం ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసిపికి రివర్స్ షాక్ ఇస్తారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ధర్మవరం నియోజవర్గం నాయకులు నిషార్ అహ్మద్, మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్ నాయుడు, ఆదినారాయణ, నాగరాజు, నారాయణస్వామి, గోపాల్ నాయక్, శ్రీనివాసులు, అమర్, ఉత్తన్న, సుబ్బరాయుడు, వినయ్ పాల్గొన్నారు.

మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి : టిడిపి

సమావేశంలో మాట్లాడుతున్న బికె. పార్థసారధి

స్థానికులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్రంలో ప్రజా సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారధి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈనెల 25వ తేదీన తెలుగుదేశం పార్టీ చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథం పేరుతో పెనుకొండ నియోజకవర్గం జరిగే యాత్ర ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మునిమడుగు చిన్నవెంకటరాముడు, మండల కన్వీనర్ సిద్దయ్య, టౌన్ కన్వీనర్ రవిశంకర్,మహిళా టౌన్ కన్వీనర్ గాయిత్రి, కేశవయ్య, పాలడుగు చంద్ర, రఘువీర చౌదరి, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, బోయనాగరాజు, హుజూర్, లక్ష్మినారాయణ రెడ్డి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలు పడుతున్న కష్టాలు చూసిన తర్వాతే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉండేందుకు మినీ మ్యానిఫెస్టోను ప్రకటించారని ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణంలో బుధవారం నిర్వహించారు. నారాచంద్రబాబునాయుడు ప్రకటించిన మినీమెనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంచి పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేష్ చౌదరి, మేకల రామాంజనేయులు,పరిసే సుధాకర్ ,కష్ణాపురం జమీర్ అహ్మద్, షరీఫ్,చట్ట లక్ష్మీనారాయణ, సంజీవులు, పల్లపు రవీంద్ర,పల్లపు శివశంకర్, కృష్ణమూర్తి, కరెంట్ ఆది కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర :తెలుగుదేశం పార్టీ మినీ మేనిపోస్ట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే ఈరన్న కోరారు. భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథం కార్యక్రమంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26న మడకశిర నియోజకవర్గంలో జరిగే యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగప్ప, ఆదినారాయణ, అశ్వత్థామప్ప, ఉగ్రనరసింహ, వీరకేతరాయ, కెంచప్ప తదితరులు పాల్గొన్నారు.

రామగిరి : టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మినీ మెనిఫెస్టోను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత కుటుంబ సాధికార సారధులదేనని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో ప్రచార కార్యక్రమానికి సంబంధించి కీలక సమావేశం నిర్వహించారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన స్వగృహంలో రామగిరి మండల పరిధిలోని టిడిపి నాయకులు, క్లస్టర్, సెక్షన్ ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా మెనిఫెస్టోలోని ఆరు ముఖ్యమైన అంశాల గురించి సునీత వివరించారు.

పూల ఆదిశేఖర్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-అనంతపురం

పూల ఆదిశేఖర్‌రెడ్డి

శ్రీ కష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గణాంక శాస్త్రంలో పరిశోధన చేసిన పూల ఆదిశేఖర్ రెడ్డికి ఎస్‌కెయు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈయన గణాంక శాస్త్ర విభాగంలో విశ్రాంత ఆచార్యులు పాలగిరి మహమ్మద్ అక్తర్ పర్యవేక్షణలో "ఆప్టిమైజేషన్ ఆఫ్ సిఎఎస్పి కుసుమ్ స్కీమ్స్ బేస్డ్ ఆన్ నాధరాజ హగీగి మరియు జనరలైజ్డ్ వియాబుల్ జాంపిడ్జ్ డిస్ట్రిబ్యూసన్స్" అనే అంశంపై పరిశోధన చేశారు. పరిశోధన గ్రంధంలో ఆయన వస్తు తయారీ రంగ సంస్థల్లో ఉత్పాదక, నాణ్యత నియంత్రణ విభాగాల్లో వస్తువు నాణ్యత స్థాయి అంగీకరించడంపై వివరించారు. ఎలక్ట్రిక్ బల్బు, గాజుగ్లాసు మొదలైన వస్తువుల నాణ్యతలను తెలియజేసారు. ఈ మేరకు ఆయనకు డాక్టరేట్ లభించింది.

నారాయణ పాఠశాలపై చర్యలకు ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కొత్తచెరువు : నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కొత్తచెరువులోని నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయక కార్యదర్శి పవన్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నారాయణ పాఠశాల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా అడ్మిషన్లు నిర్వహించి అధిక ఫీజులు పాల్పడుతున్నారని విమర్శించారు. ఏడవ తరగతి వరకే ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా పదవ తరగతి వరకు అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని అన్నారు ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు 25వేల నుండి 35 వేల వరకు విద్యార్థులతో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అక్కడే పుస్తకాలు యూనిఫామ్ దుస్తులకు అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ఇరుకు గదులలో పాఠశాలను నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి కనీసం క్రీడా మైదానం కూడా లేదన్నారు. కండిషన్ లేని బస్సులతో విద్యార్థులను తరలిస్తున్నారని విమర్శించారు. అధికారులు స్పందించి విచారణ చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నవీన్, మహేంద్ర, భరత్, చంద్ర, మురళి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు అవగాహన అవసరం

పుట్టపర్తి రూరల్: ప్రతి డ్రైవరు తను నడుపుతున్న వాహనంపై పూర్తి అవగాహన పెంచుకుంటే అది మరింత కాలం మన్నిక వస్తుందని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం జిల్లా పరిధిలోని పోలీస్ డ్రైవర్లకు రిఫ్రెష్ కోర్స్ లో బాగంగా ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ వాహనం పై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. వాహనం నిర్వహణ తో పాటు వాహనంలో ప్రయాణించే ఇతర వ్యక్తుల రక్షణ కూడా డ్రైవర్ పైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు ఎఆర్ డిఎస్‌పి విజయ్ కుమార్ , ఎంవిఐ కదిరి వరప్రసాద్ మహేంద్ర, టయోటా, కంపెనీల సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణా అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులను జిల్లా ఎస్పీ సన్మానించారు.

రైల్వే స్టేషన్ తనిఖీ

హిందూపురం : పట్టణంలోని రైల్వేటేషన్‌ను రైల్వే శాఖ హుబ్లీ డివిజన్ జనరల్ మేనేజర్ సంజీవ్ కిషోర్, బెంగళూరు డివిజన్ డిఆర్‌ఎం శామ్ సింగ్ బుధవారం తనిఖీ చేశారు. హిందూపురం రైల్వేస్టేషన్ ప్రయాణికులకు అందుతున్న సేవలు, ప్రస్తుతం నెలకొన్న సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే అధికారులు జాగ్రత్తగా పని చేయాలని సూచించారు. హిందూపురం రైల్వే స్టేషన్ లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ డిసిఎం, స్థానిక స్టేషన్ మాస్టర్‌తో పాటు అధికారులు సోమప్ప, శ్రీకాంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



'పురం'లో ఆగిన అభివృద్ధి

మున్సిపాలిటీలో సిండికేట్‌గా మారిన గుత్తేదారులు

రూ.9.78 కోట్ల అభివృద్ధి పనులు

అభివృద్ధి పనుల కోసం గుత్తేదారులు రాజకీయ నేతల చుట్టు తిరుగుతు. ఆ పనులను తమకే అప్పగించాలంటు బేరసారాలు జరపడం సర్వసాధారణం. అయితే ఇందుకు విరుద్దంగా హిందూపురం పురపాలక సంఘంలో ఉంది. పురపాలక సంఘంలో అభివృద్ధి పనులకు కౌన్సిల్ అమోదం తెలిపి టెండర్ పూర్తి చేసి ఆ పనులను దక్కించుకున్న గుత్తేదారులు సంవత్సరాలు గడుస్తున్నా పనులను ప్రారంభించడం లేదు. ఒక్క హిందూపురం పురపాలక సంఘంలోనే రూ.9.78 కోట్ల విలువైన 100 అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. దీంతో అభివృద్ధి అన్న జాడ హిందూపురం పురపాలక సంఘంలో కనిపించడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో దాదాపు 15 మందికి పైగా గుత్తేదారులు ఉన్నారు. ఇందులో 10 మంది నిత్యం అందుబాటులో ఉండి అన్ని పనులకు టెండర్ వేస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే కాంట్రాక్టర్లు అప్పటి పాలకుల వద్దకు వెళ్లి పనుల కోసం బేరసారాలు ఆడేవారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వంలో చేసిన పనులకు సంబందించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పి ఎవరు ముందుకు రాలేదు. అయినప్పటికి పాలకులు, అధికారులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని మంజూరు చేయించారు. అంతేకాక గత మూడు సంవత్సరాల కాలంగా చేసిన అభివృద్ధి పనులకు సంబందించి రూ.9.78కోట్లు ఆయా గుత్తేదారుల ఖాతాల్లో జమ చేశారు. దీంతో పాటు ఏప్రిల్, మే నెలల్లో 10 మంది గుత్తేదారులకు రూ.98.60లక్షలు వారి ఖాతాలో జమ అయింది. అయితే ఈ 10 మంది గుత్తేదారులు ప్రస్తుతం అభివృద్ధి పనులు చేయడానికి ముందుకు రావటం లేదు. గుత్తేదారులంతా సిండికేట్‌గా మారి పనులు చేయడానికి ముందుకు రావటం లేదని తెలిసింది.

గుత్తేదారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్ ఫోటో)

ఇప్పుడు ముందుకు వస్తే పర్సేంటేజీలు ఇవ్వాల్సుంటుందని వారే బతిమాలాడాలని భావిస్తున్నట్లు సమాచారం. ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు చేయాలంటే పనికి అయ్యే వ్యయంలో 30 నుంచి 40 శాతం అడ్వాన్స్‌గా కౌన్సిలర్లు గుత్తేదారులకు ఇస్తే తప్ప అభివృద్ధి పనులు చేయమని చెబుతున్నట్లు తెలిసింది. ఫలితంగా దాదాపు 100 అభివృద్ధి పనులు పురపాలక సంఘంలో ఆగిపోయాయి. పనులను వెంటనే ప్రారంభించాలని రెండు రోజుల క్రితం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, అధికారులు సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి కోరినప్పటికి తమ వద్ద పూర్తి స్థాయిలో నిధులు లేవని, పాలకులు 30 నుంచి 40 శాతం నిధులు ముందస్తుగా ఇస్తే తాము పనులు ప్రారంభిస్తామని చెప్పడం గమనార్హం

ఆగిన అభివృద్ధి పనులు

హిందూపురం పురపాలక సంఘంలో 10 మంది గుత్తేదారుల పరిధిలో రూ.9.78 కోట్ల విలువైన 100 అభివృద్ధి పనులు ఆగినాయి. ఇందులో ప్రభాకర్ రూ.1.75 కోట్ల విలువైన 14 పనులు, రంగనాథ్ రూ.2.77 కోట్ల విలువైన 16 పనులు, బాలాజీ రూ.48.27లక్షల విలువైన 12 పనులు, తౌసిఫ్ రూ.1.89 కోట్ల విలువైన 18 పనులు, చంద్రశేఖర్ రెడ్డి రూ.1.47 కోట్ల విలువైన 11 పనులు, రెహమాన్ రూ.76 లక్షల విలువైన 8 పనులు, మురళి రూ.42 లక్షల విలువైన 11 పనులు, ముజమ్మీల్ ఖాన్ రూ.6.87 లక్షల విలువైన 4 పనులు, ఇమ్రాన్ రూ.2.8 లక్షల విలువైన 2 పనులు, సయ్యద్ నయూంకు చెందిన రూ.13.7 లక్షల విలువైన 4 పనులు ఆగాయి. ఇందులో 31 పనులు గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరు చేశారు. దీనికి సంబందించి రూ.1.72కోట్లు నిధులు సిద్దంగా ఉన్నాయని, పనులు పూర్తి చేసిన వెంటనే గుత్తేదారుల ఖాతాలో జమ అవుతాయని పనులు పూర్తి చేయాడానికి గుత్తేదారులు ముందుకు రావాలని పాలకులు, అధికారులు కోరుతున్నప్పటికి వారు ముందుకు రావడం లేదు.

ఈ పనులకు పోటా పోటీ...

సిమెంటు రోడ్లు, సిమెంట్ మురుగు కాలువల పనులకు అయితే గుత్తేదారులు ముందుకు రావడం లేదు. అయితే జిఎస్‌బి, గ్రావెల్ రోడ్లు, మోటార్ల రిపేరీ, వాహనాల మరమ్మతులు, మురుగు కాలువల్లో సింట్ తొలగించే పనులకు అయితే గుత్తేదారులు పోటీ పోటీగా ముందుకు వస్తున్నారు. ఇందులో ఎక్కువ శాతం మిగులుతుందని వారి అంచనా. జిఎస్‌బి, గ్రావెల్ రోడ్ల పనుల్లో అయితే ఉన్న రోడ్డుపై కొద్ది మట్టి, కంకర వేసి మమ అనిపించి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. ఈ విషయంలో ఇంజనీర్లు, గుత్తేదారులు మిలాఖత్ అవుతున్నట్లు విమర్శలున్నాయి. ఇక మురుగు కాలువల్లో సింట్ తీసివేయడానికి అయితే లక్షలాది రూపాయాలు వినియోగిస్తున్నారు. అయినప్పటికి ఆ కాలువలు శుభ్రం కావడం లేదు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

గోరంట్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని పలువురు వ్యక్తులు తెలిపారు యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆసుపత్రి కమిటీ చైర్మన్ చింతా రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ -2గా నరసింహమూర్తి

మడకశిర రూరల్ : మడకశిర 2వ విద్యాధికారిగా నరసింహమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎస్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మంజునాథ్, పీటర్ బాబు, శివన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

25న ఉచిత వివాహ వేదిక

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి కేంద్రంలో 25న ఉచిత వివాహ వేదిక నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జివిఆర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. సాయిఆరామం ఫంక్షన్ హాల్ లో 25న ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఏర్పాటు చేస్తున్నారని ఈ ఉచిత వివాహ పరిచయ వేదికకు యువతీ యువకులు పెళ్లి కావలసినవారు హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోని అందరు వినియోగించుకోవాలని పుట్టపర్తి బలిజ సంఘం నాయకులు కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

కొత్తచెరువు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంఇఒలు జయచంద్ర, సుధాకర్ తెలిపారు. వీరికి హెచ్ఎం నుండి ఎంఇఒలుగా ప్రమోషన్ రావడంతో స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జయరాం వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం వెంకన్న, రిటైర్డ్ ఎంపీడీవో మహమ్మద్, అటెండర్ వెంకటరమణ, వైసీపీ నాయకుడు వాల్మీకి శంకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కదిరి టౌన్ : ఆర్థిక అక్షరాస్యతతో కుటుంబాలు సురక్షిత జీవనం సాగించవచ్చని ఎపిఎం సూర్యనారాయణ, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కదిరి రూరల్ మండలం కాలసముద్రం గ్రామంలో జన సురక్షపై వెలుగు ఎపిఎం సూర్యనారాయణ, వెలుగు సీసీ నిర్మలమ్మ ఆధ్వర్యంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సహకారంతో కాలసముద్రం మేనేజర్ నాగరాజు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలందరినీ బీమా పరిధిలోకి తీసుకొచ్చేందుకు కసరత్తు జరుగుతోందని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన క్రింద జీవిత ప్రమాద బీమా సదుపాయం కలిగించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. బ్యాంకు ఖాతా ఉన్నవారు ఏడాదికి 436 చెల్లిస్తే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి కింద రెండు లక్షలు, ఏటా కేవలం 20 రూపాయలు ప్రీమియం చెల్లిస్తే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రెండు లక్షల రూపాయలు ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తోందన్నారు. అర్థిక అక్షరాశ్యత కౌన్సిలర్ వీర మారుతి , నాగప్ప సైబర్ మోసాలు పె అవగహన కల్పిచారు. ఈ కార్యక్రంలో గ్రామీణ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ నాగార్జున, నరేష్, వెలుగు యానిమేటర్స్ రామన్నమ్మ, ఆరిఫుల్లా, నూర్‌బాషా, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

డీఎస్సీ టాపర్‌కు న్యాయం చేయాలి

కదిరి టౌన్ : డీఎస్సీ టాపర్ నాగా శేషుకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఎన్‌హెచ్‌ఆర్‌పిఎఫ్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షాకీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ నాగశేషు రెండు రోజుల నుంచి కదిరి పట్టణం లోని మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్ష చేస్తున్నారు. ఈ దీక్షకు మొహమ్మద్ షాకీర్ బుధవారం మద్దతు తెలిపారు. ఈసందర్భంగా నాగశేషు మాట్లాడుతూ డీఎస్సీ2018 టి ఆర్ టి వ్యాయామ ఉపాధ్యాయునికి సంబంధించిన రాతపూర్వక పరీక్షలలో జిల్లా టాపర్ అయిన తనకు న్యాయం చేయాలని కోరారు. సుప్రీంకోర్టు స్పెషల్ లీవ్ పిటిషన్ తిరస్కరణతో తీవ్ర అన్యాయం జరిగిందని నాగ శేషు వాపోయాడు. తిరస్కరించిన స్పెషల్ లీవ్ పిటిషన్ ని తిరిగి ఆమోదించాలని ఆయన కోరారు.

సేవలతోనే అధికారులకు గుర్తింపు

అమరా పురం : ఉత్తమ సేవలతోనే అధికారులకు తగిన గుర్తింపు వస్తుందని తహశీల్దార్ గురుబ్రహ్మం అన్నారు. మండల సర్వేయర్ దినేష్ రెడ్డి, విఆర్ఒ బివి మూర్తి బదిలీపై వెళుతున్న నేపథ్యంలో వారిని బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

రొద్దం : మండలంలోని పలు సచివాలయాలను జిల్లా నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని కలిపి, పెద్దమంతురు సచివాలయాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్రెస్ కోడ్ తప్పనిసరి అన్నారు. సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, ఆయా సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, వీఆర్వో బాబావలి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం వైసిపి నాయకుడు టిడిపిలో చేరారు. వైసిపికి చెందిన రుద్రముని మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో బుధవారం టిడిపిలో చేరాడు. ఈసందర్భంగా రుద్రముణికి గుండుమల తిప్పేస్వామి పార్టీ కండూవా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, గుడిబండ మండల అద్యక్షుడు మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, దుర్గేష్, శివకుమార్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

షేక్ షాఫియా ఆచూకీ తెలపండి

పెనుకొండ : పట్టణంలోని దర్గాపేటకు చెందిన ఖలీల్ కుమార్తె షేక్ షాఫియా(4) పది రోజుల క్రితం ఇంటి దగ్గర నుంచి తప్పిపోగా ఇప్పటికి వరకు కూడా ఆచూకీ దొరకలేదని ఈ విషయంలో పోలీసులు బాధితులకు న్యాయం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధితులను పరామర్శించారు. అనంతరం ఎస్పీ, డిఎస్‌పితో పార్థసారథి ఫోన్‌లో మాట్లాడారు. బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ టౌన్ కన్వీనర్ రవి శంకర్, టీడీపీ నాయకులు హుజూర్, షౌకత్, జావీద్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ బాధితులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, కురుబవాండ్లపల్లి మాజీ సర్పంచి సోమశేఖర్, త్రివేంద్ర నాయుడు , సుబ్రహ్మణ్యం, మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్ లాగ్ పోస్టుల ఎంపిక పరీక్ష ప్రశాంతం

బత్తలపల్లి : మండలకేంద్రంలోని శ్రీ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలోని బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి మంగళవారం నిర్వహించిన ఎంపిక పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. పాఠశాలలో 4 బ్యాక్‌లాగ్ పోస్టులు వుండగా 23 దరఖాస్తులు వచ్చాయన్నారు. మంగళవారం నిర్వహించిన పరీక్షకు 17మంది హజరయ్యారన్నారు. పరీక్ష రాసిన వారి నుండి నలుగురిని ఎంపిక చేశామని, వారి వివరాలను కలెక్టర్ అనుమతి కోసం పంపించామని చెప్పారు.

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ధర్మవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కదిరి డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పుట్టపర్తి అర్బన్: సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎర్ర బాడ్జీలు ధరించి డిపో గేటు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ ఉపాధ్యక్షుడు ఎస్ శంకర్, యూనియన్ జిల్లా చైర్మన్ ముత్యాలప్ప మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగుల అక్రమ బదిలీలు, అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఉపాధ్యక్షులు రవితేజ, కోశాధికారి చంద్రాయుడు, కార్యదర్శి శ్రీనివాసులు, డిపో సలహాదారుడు అప్పిరెడ్డి, డిపో కార్యదర్శి బాబు జాన్, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు నూర్ మహమ్మద్, నాయకులు శివశంకర్, కళావతి, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం నేషనల్ మద్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు గేటిమీటింగ్ నిర్వహించి ఎర్రబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎంయుఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణ, జోనల్ వైస్ ప్రెసిడెంట్ జేపీ కుమార్, రీజనల్ అధ్యక్షులు అశ్వర్థమయ్య, రీజనల్ నాయకులు నాగశేఖర్, నీళ్ల శంకరయ్య, దుర్గప్రసాద్ మాట్లాడుతూ అక్రమ బదిలీలు, అక్రమ సస్పెన్షన్లు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్యారేజీలో నామ్స్ ప్రకారం అన్ని క్యాటగిరిలలో సిబ్బందిని నియమించాలని, గ్యారేజీలో అవసరమైన పనిముట్లు తెప్పించాలని, నైట్‌అవుట్, నైట్ షిఫ్ట్ అలవెన్స్ లో ప్రతినెల జీతంతో కలిసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నిరసనలో యూనియన్ నాయకులు హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : జిల్లాలోని ఆరు డిపో లలో నెలకొని వున్న ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని రీజినల్ కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం కదిరి డిపో నందు ఉద్యోగులు ఎర్రబ్యాడ్జిలు ధరించి, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిథిగా కడప జోన్ జాయింట్ సెక్రటరీ శ్రీరాం నాయక్ మాట్లాడుతూ జిల్లా ప్రజారవాణా అధికారి, ఉద్యోగుల సమస్యల పట్ల మొండివైఖరి అవలంభిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు అక్రమ బదిలీలు చేస్తున్నాడని, అప్పీల్లు పెండింగ్ లో వున్నాయని, ఉద్యోగుల బకాయిలు ఇవ్వడం లో అశ్రద్ధ వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ నాయకులు ప్రభాకర్ రెడ్డి,గంగన్న, డిపో అధ్యక్షులు రామక్రిష్ణ, చైర్మన్ నారాయణ స్వామి, సెక్రటరీ బైరిశెట్టి, రమణ, అజీజ్, ఫయాజ్, రహంతుల్లా, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న వైస్ చైర్మన్ బలరామిరెడ్డి

నీట్, ఎంసెట్‌లో మెరిసిన విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షల్లో బాలయేసు కళాశాల విద్యార్థిని శ్రావణి 514 మార్కులు సాధించింది. ఎంసెట్‌లో చంద్రశేఖర్ రెడ్డి 2వేల ర్యాంకు సాధించారు. వీరిని పట్టణంలోని బాలయేసు కళాశాలలో బుధవారం సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి, ప్రిన్సిపల్ సౌరిరెడ్డి మాట్లాడుతు అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన విద్యార్థులు బాగా చదువుకుని, రాబోయే పోటీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అశ్వర్థ నారాయణ, ప్రభాకర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన : కేంద్రమంత్రి

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతోందని కేంద్రమంత్రి దేవ్ సిన్హా చౌహన్ విమర్శించారు.బుధవారం పట్టణంలోని బీజేపీ సీనియర్ నాయకులు పాలూరి కృష్ణమూర్తి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించిన అనంతరం భోగసముద్రం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ మైన్స్, వైన్స్ తోనే రాష్ట్ర ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం పెద్ద ఎత్తున అవినీతి పేరు తెచ్చుకుందన్నారు. అనంతరం భోగసముద్రం చెరువులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు జిఎం. శేఖర్, భానుప్రకాష్ రెడ్డి, ఉత్తంరెడ్డి, శ్రీనివాసులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం టౌన్ : ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకె శ్రీనివాసులు కోరారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉచిత మెగా వైద్య శిబిరానికి సంబందించినకరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావేరి ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఈనెల 25న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి రాధాకృష్ణ, పీఆర్డీ జయరాం, కావేరి ఆసుపత్రి ప్రతినిధి మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాలిచ్చే వరకూ ఉద్యమాలు కొనసాగిస్తాం

ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

కొత్తచెరువు : అర్హులైన పేద ప్రజలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చేంతవరకు తమ పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అన్నారు. పది రోజులుగా కొత్తచెరువు సమీపంలోనే పుట్టపర్తి రోడ్లో 483 సర్వేనెంబర్ లో నల్ల కొండ వద్ద వేలాది మందితో ఎర్రజెండాలు పాతి గుడిసెలు వేసుకొని అక్కడే వంటావార్పు చేసుకుని నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బుధవారం పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ రామాంజనేయరెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి గుడిసెలు వేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ జులై ఒకటవ తేదీ నుండి 31వ తేదీ వరకు జగనన్న సురక్షిత పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మీ ఇంటి వద్దకే రెవిన్యూ అధికారులు సచివాలయం అధికారులు వచ్చి సర్వే నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి 90 రోజుల లోపల ఇంటి పట్టాలు మంజూరు చేస్తారని అన్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

పుట్టపర్తి రూరల్: జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు కొత్తచెరువు మండలంలోని నల్లగుట్ట సమీపంలో సిపిఐ ఆధ్వర్యంలో ఇటీవల ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన గుడారాలను వెంటనే తొలగించాలని ఆర్డీవో భాగ్యరేఖ సూచించారు. ఆమె మామిళ్ళకుంట రైల్వే స్టేషన్ సమీపంలోని నల్లగుట్ట ఆక్రమణ ప్రదేశాన్ని బుధవారం రెవెన్యూ అధికారులతో వెళ్లి పరిశీలించారు.

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తికి జాతీయ సేవా పురస్కారం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వెంకట గోపాల్ గౌడకు 2023 ఫ్రీడమ్ ఫైటర్ షహీద్ టిప్పు సుల్తాన్ జాతీయ సేవా పురస్కారాన్ని అందజేశారు. పుట్టపర్తిలో మోటూరు హనుమంతరావు 22వ స్మారక ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు ప్రధానోత్సవం సభలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు షామీర్, సత్య సాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు హనుమంతు. ఆవాజ్ రాష్ట్ర నాయకులు ఇంతియాజ్ తదితరులు గోపాలగౌడను సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా దేశ ప్రజలకు న్యాయం అందిస్తూ రిటైర్డ్ తరువాత దేశంలో ప్రజాస్వామ్య లౌకిక గణతంత్రం సమైక్యత సమగ్రత చైతన్యానికి తోడ్పాటుకు శ్రమిస్తూ దేశ సేవ చేస్తున్నందుకు ఈ పురస్కారం అందజేస్తున్నామని ఉమర్ ఫారూక్ ఖాన్ అన్నారు.

మాజీ జడ్జిని సన్మానిస్తున్న ప్రముఖులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

రొద్దం : మండలపరిధిలోని గౌరాజుపల్లికి చెందిన మహిళకు బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలు అయ్యాయి. గ్రామానికి చెందిన శంకరప్ప ఆయన భార్య నాగమణి బుధవారం పనినిమిత్తం పెనుకొండకు వెళ్లి ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణం అయ్యారు. పాతర్లపల్లి వద్దకు రాగానే పావగడ వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని కారు వేగంగా వస్తుండటాన్ని గమనించిన శంకరప్ప తన వాహనాన్ని రోడ్డుపక్కకు నిలిపాడు. అయినప్పటికీ కారు వేగంగా వచ్చి వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగమణి గాయాలపాలైంది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు అప్రమత్తమై కారును పలుచోట్ల ఆపడానికి ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. తీవ్రంగా గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలించారు.

పేకాట జూదరులు అరెస్టు

బుక్కపట్నం : మండల పరిధిలోని గసిగవారి పల్లెవద్ద పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ఈసందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.15,260 నగదు, 6 సెల్ ఫోన్లు, 7 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

తుమ్మలకుంట చెరువులో చేపలు మృతి

చిలమత్తూరు : మండల పరిధిలోని తుమ్మలకుంట చెరువులో చేపలు మృతిచెందడంకలకలం రేపింది. నిత్యం పశువులు,గొర్రెలకు ఆ చెరువులోని నీటినే వాడుతుంటారు. అయితే బుధవారం చెరువు నీటిలో చేపలు మృతిచెంది తెలియాడతుండటంలో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. చెరువులో ఎవరైన చేపలపై విషప్రయోగం చేశారా?లేదా ఏదైన వ్యాధి కారణంగా మృతి చెందాయా అన్నది తేలాల్సుంది. అధికారులు నీటి నమూనాని సేకరించి పరీక్షలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

బత్తలపల్లి : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక కార్యాకలాపాలపై అవగాహన కల్పించేందుకు క్విజ్ పోటీలు నిర్వహించారు. బుధవారం మండలంలోని హైస్కూల్ విద్యార్థులకు బత్తలపల్లి యూనియన్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ చంద్రశేఖర్ నేతృత్వంలో బత్తలపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో బత్తలపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మదిహా, ఆఫ్రిన్ సుహానకు మొదటి బహుమతి కింద రూ. 5వేల నగదు అందజేశారు. అదేవిధంగా కేజీబివి విద్యార్థినులు స్పందన, సుమాంజలిలు ద్వితీయ బహుమతి కింద రూ.4వేలు గెలుచుకున్నారు. రామాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు మౌనిక, ధనూష తృతీయ బహుమతి కింద రూ.3వేలు నగదును అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చాముండేశ్వరి, ప్రధానపాధ్యాయురాలు జయంతి, ఉపాధ్యాయులు ఆనందరెడ్డి, శరణ్య, రాజేంద్రప్రసాదు, లక్ష్మినారాయణ, గీతాంజలి, పార్వతి, శైలజ.. తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలోని రెక్కమాను, నీరు కుట్లపల్లి. తుమ్మలబైలు. జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 8, 9, 10 వ తరగతి విద్యార్థులకు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం క్విజ్ పోటీ పరీక్షలు నిర్వహించినట్లు. ఆంధ్ర ప్రగతి బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ డి శ్రావణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 12 మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనగా ఆరుగురు గెలుపొందారన్నారు. ఈ నెల 26 జిల్లా స్థాయికి పోటీ పరీక్షల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మధురాంబ, ఇన్విజిలేటర్ గంగాధర్. బ్యాంకు సిబ్బంది నాగేంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవాలి

బత్తలపల్లి : రైతులు తాము నాటుకున్న మొక్కలను ఎండిపోకుండా సంరక్షించుకోవాలని ఎంపిడిఒ శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలోని ముష్టూరు పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద రైతులు నాటుకున్న మొక్కలను ఎపిఒ ఆదెప్పతో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంటు ఓబిశేషు, రైతులు పాల్గొన్నారు

బదిలీ పోలీసులకు సన్మానం

ఓబుల దేవర చెరువు : స్థానిక పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ బదిలీ అయిన పోలీసులను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐ రాజేంద్ర నాథ్ యాదవ్ మాట్లాడుతూ పోలీసులు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు కిషోర్ కుమార్ రెడ్డి, రమణారెడ్డి. సిబ్బంది వెంకట్రాముడు, కోలా అంజి, నరేష్ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

రొళ్ల : మండల పరిధిలోని రత్నగిరి గ్రామ సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వాలంటీర్లు గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలకు సంబంధించిన పత్రాలను సమకూర్చుకొని వారికి సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుఆర్‌డి కృష్ణప్ప, సర్పంచి చిన్న రంగప్ప, పంచాయతీ కార్యదర్శి రచన, వీఆర్వో సూర్యప్రకాష్ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

లేపాక్షిలో యోగా చేస్తున్న దృశ్యం

యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, యోగా గురువు గొర్ల నారాయణరెడ్డి, తదితరులు

రొళ్ల: మండల పరిధిలోని సుప్రసిద్ధ ప్రాచీన చారిత్రక ప్రాంతంగా పేరుగాంచిన రత్నగిరి కోటలోని ఆకర్షణీయమైన చారిత్రక కట్టడమైన అరసన బావి ప్రదేశంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. యోగా వల్ల కలిగే లాభాలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచి చిన్న రంగప్ప, పంచాయతీ కార్యదర్శి రచన, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక నంది విగ్రహం వద్ద బుధవారం యోగాడేను నిర్వహించారు. కేంద్ర టెలి కమ్యూనికేషన్ సహాయ శాఖ మంత్రి దేవొసిన్ చౌహన్ నంది సమీపంలోని ఆవరణంలో ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. యోగా దినోత్సవం పురస్కరించుకొని కేంద్ర మంత్రి దేవొసిన్ చౌహన్, బిజెపి జాతీయ కార్యదర్శి సునీల్ దియేధర్ మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సురతి సురాతిని, సబ్ కలెక్టర్ కార్తీక్, పోస్ట్ మాస్టర్ జనరల్ డివిఎస్ ఆర్ మూర్తి, డైరెక్టర్ పోస్టల్ సర్వీస్ జగదీష్ పాయ్, ఆయుష్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కెవి కుమార్ బాబు, హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ బాల సత్యనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షుడు వజ్ర భాస్కర్ రెడ్డి, డీఎస్పీ కంజక్షన్, తహశీల్దార్ బాబు, రూరల్ సిఐ వేణుగోపాల్, ఎస్ఐ మునీర్ అహ్మద్, శ్రీనివాసులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : యోగ అలవాటుగా ఉంటే మంచి ఆరోగ్యంగా ఉన్నట్లేనని న్యాయమూర్తులు ప్రతిమ, మీనాక్షి, సుందరి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణములోని కోర్టు ఆవరణములో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సుబ్బరాజు గుప్తా, నరసింహులు, ఏపీపీ స్వామి,సురేంద్ర, యోగా గురువులు కుసుమ సాయి, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో ప్రభుత్వ బాలుర హై స్కూల్ నందు 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాంస్కృతిక మండలి ఫౌండర్ సత్రసాల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, బ్రహ్మకుమారీస్ రాధ, హిందీ పండిట్ వేణుగోపాల్, ధర్మవరం యోగా అసోసియేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు గాజుల సోమేశ్వర్ రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : యోగ చేయడం వలన ఆరోగ్యంతో పాటు ఉల్లాసవంతంగా ఉంటారని రిటైర్డ్ ఎంఇఒ శివారెడ్డి సురేష్ పేర్కొన్నారు. ప్రపంచ యోగ దినోత్సవ పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ షిర్డిసాయి ఇంగ్లీషుమీడియం హైస్కూల్ నందు యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: యోగా చేయడం వలన మంచి ఆరోగ్యము మంచి ఆలోచనలు వస్తాయని, శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం, జిల్లా పోలీసు కార్యాలయం లో ప్రపంచ యోగ దినోత్సవం-2023 ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఎస్‌డిపిఒ వాసుదేవన్, ఎఆర్ డిఎస్‌పి విజయ్ కుమార్, సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, రవీందర్ రెడ్డి, ఆర్ఐలు టైటస్, శ్రీశైలం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : యోగాతోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మాజీ మంత్రి రఘువీరారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని నీలకంఠాపురంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.

బత్తలపల్లి : మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో దోహదపడుతుందని ఎంపిపి బగ్గిరి త్రివేణి, జడ్పిటిసి కోటి సుధ అన్నారు. బుధవారం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ప్రపంచ యోగా డేను పురస్కరించుకుని విద్యార్థులు యోగా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీదేవి, ఎంఇఒ -2 సుధాకర్ నాయక్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్య మవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూపురం పట్టణంలోని వివిధ విద్యాసంస్థల్లో, వివేకానంద యోగా థెపపీ ఇన్‌స్టిట్యూట్ తదితర ప్రాంతాల్లో యోగ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, సెక్రటరీ శ్రీనివాసుల, గంగాధరయ్య గుప్తా, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పురుషోత్తమ రెడ్డి, సప్తగిరి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో యోగా శిక్షకులు సుదర్శన్ గురూజీ, డిగ్రీ, పిజి కళాశాలల ప్రిన్సిపల్ శివశంకర్ రెడ్డి, ఎస్ పార్థసారథి, ఏ కేశవరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌ను శాలువాలతో సత్కరిస్తున్న ఆదిగురు యోగా కేంద్రం సభ్యులు

ధర్మవరం టౌన్ : ప్రతి మనిషికి జీవితంలో యోగా ఒక భాగం కావాలని విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌కాచర్ల లక్ష్మి తెలిపారు. ధర్మవరం పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీ ఆదిగురు యోగా కేంద్రం గురువు గొర్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సామూహిక యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత నాయకులు కాచర్ల ఆంజి, ఆదిగురు యోగా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.అదే విధంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ధర్మవరం యోగా అసోసియేషన్ అధ్యక్షుడు. సోమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సాంస్కతిక మండలి వ్యవస్థాపకుడు సత్రసాల ప్రసన్నకుమార్, హింది. పండిట్ వేణుగోపాల్, హెచ్ఎం రాజేశ్వరి, బ్రహ్మకుమారీస్ రాధులు హాజరై యోగాసనాలు చేశారు. కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుదవారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ప్రిన్సిపల్ ప్రభాకర్రెడ్డి,వైస్ ప్రిన్సిపల్ జీవన్ కుమార్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు.